సాక్షి
కుమురం భీం
గురువారం : 21 : సెప్టెంబర్ : 2023



రవాణా సౌకర్యం లేక ఇక్కట్లు

బెజ్జూర్ మండలంలోని అనేక గ్రామాలకు రవాణా సౌకర్యం లేదు. అత్యవసర సమయాల్లో వృద్ధులు, గర్భిణులు, పిల్లలు అవస్థలు పడుతున్నారు. 9లో



ఎమ్మార్పీఎస్ నిరసన

ఆసిఫాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. బాలాజీ, రమేశ్, రాజు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.9/24.7

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడుతుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్జీఎఫ్ కార్యదర్శిగా పీడీ బాబురావు



బాబురావుకు నియామక పత్రం అందజేస్తున్న డీఐఈవో శైలజ

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) అండర్–19 ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా పీడీ బాబురావును నియమించినట్లు డీఐఈవో శైలజ తెలిపారు. 2023–25 విద్యా సంవత్సరానికి గాను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశానుసారం కళాశాల క్రీడా సమాఖ్య కార్యదర్శిగా నియమించామని పేర్కొన్నారు. జిల్లా క్రీడా సమాఖ్య అండర్–19 చైర్‌పర్సన్‌గా జిల్లా కలెక్టర్, అధ్యక్షురాలుగా డీఐఈవో, కార్యదర్శిగా సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ బాబురావు వ్యవహరిస్తారని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్: నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా ఏడాది కాల పరిమితితో ఒప్పంద పద్ధతిలో పనిచేసేందుకు అర్హత కలిగిన యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు https:// asifabad. telangana. gov. in, 79950 16036 నంబర్‌లో సంప్రదించాలన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కరాటే ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లాస్థాయి కరాటే పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పాఠశాలల క్రీడల ప్రధాన కార్యదర్శి సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు పోటీలకు హాజరుకావాలని సూచించారు. అండర్– 14 విభాగంలో పాల్గొనే వారు 2010 జనవరి 1 తర్వాత జన్మించి, బాలురు 48 కిలోలు, బాలికలు 45 కిలో ఉండాలని పేర్కొన్నారు. అండర్ 17 విభాగంలో పాల్గొనే వారు 2007 జనవరి 1 తర్వాత జన్మించి, బాలురు 54 కేజీలు, బాలికలు 50 కేజీలలోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 94407 20514 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

బీజేపీ సంబురాలు



నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్: లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని రాజంపేటలో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పార్టీ నాయకులు మాట్లాడుతూ మహిళలు మహారాణులుగా జీవించాలని ప్రధాని చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మహిళలే దేశానికి పాలిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోదీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షులు కుమ్రం వందన, నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా ఆత్మారాం నాయక్, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్, మండల అధ్యక్షులు మద్దెర్ల శ్రీధర్, సంపత్ పాల్గొన్నారు.

లారీ యజమానుల సమ్మె



నిరసన తెలుపుతున్న యజమానులు

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ పేపర్ మిల్లు (ఎస్పీఎం) మొండి వైఖరికి నిరసనగా బుధవారం లారీ యాజమానులు సమ్మె బాటపట్టారు. ఈ సందర్భంగా లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌బాబు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ట్రాన్స్‌పోర్టు చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 155 సంఘాలు తమ సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటించాయని తెలిపారు. అధికారులు, మిల్లు యాజమాన్యం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ షమా, ఉస్మాన్, కార్యదర్శి నిజాముద్దీన్, కోశాధికారి అహ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ రికార్డుల్లో బీడీపీపీ భూమిని పట్టా భూమిగా మార్చి రూ.కోటికి విక్రయిస్తున్న స్థలం ఇదే..

బీడీపీపీ భూమికి బేరం

- ప్రభుత్వ స్థలానికి పట్టా
- రెవెన్యూ అండతో రిజిస్ట్రేషన్
- ఎకరా స్థలం రూ.కోటికి విక్రయం
- జిల్లాలో ఓ పత్తి వ్యాపారి బరితెగింపు
- కెరిమెరికి చెందిన వ్యాపారితో ఒప్పందం

సాక్షి, ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూములకు భద్రత కరువైంది. భూ బకాసురులు యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. రెవెన్యూ అధికారుల అండతో ఇటు రికార్డుల్లో.. అటు ఆన్‌లైన్‌లో హద్దులు మార్పింగ్ చేసి రూ.కోట్ల విలువైన సర్కారు భూములను హస్తగతం చేసుకుంటున్నారు. వీటిని అరికట్టాల్సిన రెవెన్యూ, సర్వే విభాగం అధికారులు రూ.లక్షలు మామూళ్లు తీసుకుని ప్రభుత్వ భూములకు 'పట్టా' భూములుగా రాజముద్ర వేస్తున్నారు. ఫలితంగా ఆసిఫాబాద్‌లో వందల ఎకరాల ప్రభుత్వ భూములు పరుల పాలై పోతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆక్రమణలపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) దృష్టి సారించి భూ బకాసురుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమికి పట్టా..

ఆసిఫాబాద్ మండలం గుండి రహదారి సమీపం జాతీయ రహదారిని ఆనుకుని సర్వే నంబరు 66, 67ల్లో దాదాపు 9 ఎకరాలకుపైగా బీడీపీపీ భూమి ఉంది. వీటికి బై నంబర్లు ఉన్న సర్వే నంబర్లలో కొందరికి పట్టా భూములు ఉన్నాయి. అందులో ఓ వ్యక్తి తన భూమిని విక్రయిస్తానని ఆసిఫాబాద్‌కు చెందిన ఓ రియల్టర్ వద్దకు గతేడాది నవంబర్ నెలలో వెళ్లాడు. అయితే తన వద్ద ప్రస్తుతం డబ్బు లేదని.. తన అనుచరులు కొనుగోలు చేస్తారని చెప్పిన సదరు రియల్టర్ తనకు తెలిసిన ఓ పత్తి వ్యాపారిని, అతని అనుచరుడిని భూమి కొనుగోలుకు ఒప్పించాడు. తర్వాత ఆ పట్టా భూమికి ఆనుకుని ఉన్న బీడీపీపీ స్థలాన్ని ప్రైవేటు భూమిగా మార్చాలనే పథకం రచించారు. రియల్టర్ ఆసిఫాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో తనకు అనుకూలంగా ఉన్న అధికారికి, సర్వే విభాగానికి చెందిన ఎంసీ(మండల చైన్‌మెన్)కి భారీ మొత్తంలో మామూళ్లు ముట్టజెప్పి.. రికార్డులు, ఆన్‌లైన్‌లో హద్దులు మార్పింగ్ చేయించి ఓ ఎకరా స్థలాన్ని పట్టా భూమిగా మార్చేసుకున్నట్లు సమాచారం. ఆ ఎకరా భూమిని పత్తివ్యాపారి తన బినామీ పేరిట గతేడాది డిసెంబర్‌లో రిజిస్ట్రేషన్ సైతం చేయించడం గమనార్హం. అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన వారే అక్రమార్కులకు సహకరించడంతో ప్రభుత్వ భూమి పట్టా భూమిగా మారిందని ఆరోపణలు రెవెన్యూ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

అధికార పార్టీ అండ..!

ఆసిఫాబాద్‌తోపాటు చుట్టుపక్కల ఉన్న మండలాల్లోని విలువైన ప్రభుత్వ భూములను తమ గుప్పిట్లో ఉంచుకుంటున్న రియల్టర్‌కు అధికార పార్టీ అండదండలు ఉన్నాయి. దీంతో అతను రెచ్చిపోతున్నట్లు సమాచారం. మాట వినని రెవెన్యూ అధికారులను నయానో భయానో లొంగదీసుకోవడమే కాకుండా.. న్యాయస్థానాలను నుంచి స్టేలు తెచ్చి వాళ్లను కట్టడి చేస్తుండటంతో రెవెన్యూ రికార్డుల్లోని సర్కారు భూములు పట్టా భూములుగా రూపాంతరం చెందుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. సదరు రియల్టర్ కూడా ఏజెన్సీ భూములను ఆక్రమించి భారీ భవంతులను నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడం జరిగింది. అలాగే అనేక ఎకరాల్లో ప్లాటు వేసి బాండు పేపర్లపై వాటిని అమాయకులకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నారని తెలుస్తోంది. ఇటీవల గుండి రహదారి సమీపంలో 1/70లో అక్రమంగా నిర్మించిన మూడంతస్తుల భవనాన్ని సైతం రూ.1.70 కోట్లకు విక్రయించడం విశేషం.

ఎకరా రూ.కోటికి విక్రయించాలని..

రియల్టర్ అనుచరుడు, సదరు పత్తి వ్యాపారి ఇటీవల ఆ స్థలాన్ని కెరిమెరికి చెందిన అధికార పార్టీ నేత, రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఎకరం భూమిని రూ.కోటికి విక్రయించాలని నిర్ణయించారు. రియల్టర్ అనుచరుడు ఆ భూమిని ఆగస్టులో కెరిమెరికు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి తనయుడి పేరిట విక్రయించి రిజిస్ట్రేషన్ చేయించాడు. పత్తి వ్యాపారి తన భూమిని కూడా ఎకరం రూ.కోటికే విక్రయించదానికి అతనితోనే ఒప్పందం చేసుకున్నాడు. అయితే తొలుత రూ.7 లక్షలు అడ్వాన్సుగా తీసుకున్నట్లు సమాచారం. మిగిలిన మొత్తం ఆరు నెలల్లో చెల్లించేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది. కాగా బీడీపీపీ భూమికి అక్రమ పద్ధతిలో పట్టా సృష్టించడమే కాకుండా.. ఇప్పుడా భూమిని రూ.కోటికి విక్రయించి సర్కారు ఖజానాకు గండి కొడుతున్నా పట్టించుకునే నాథుడు లేకపోవడం విడ్డూరంగా ఉందని రెవెన్యూ సిబ్బందే గుసగుసలాడుకోవడం గమనార్హం.

బ్యాంకర్లు రుణ లక్ష్యాలు సాధించాలి



వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అధికారులు

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: బ్యాంకర్లు నిర్దేశించిన రుణ లక్ష్యాలు సాధించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ ప్రకటించిన నేపథ్యంలో అర్హులైన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామన్నారు. ఖాతాల వివరాలు సమర్పించని రైతుల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు సేకరించి, బ్యాంకులకు అందజేయాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో నిర్దేశించిన పంట రుణ లక్ష్యాలను సాధించేందుకు వ్యవసాయ శాఖ, బ్యాంకర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల ఖాతాలు బ్యాంకు లింకేజీల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మహిళా బృందాల ఆధ్వర్యంలో గ్రామాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకర్లు సహకరించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ముద్ర రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రైకార్ రుణాల ధ్రువపత్రాలను పరిశీలించి, చిన్న పరిశ్రమలు, డెయిరీ ఫాం నెలకొల్పే వారిని ప్రోత్సహిస్తూ అర్హులకు సహకరించాలని తెలిపారు. అనంతరం వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ హన్మంత్ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, బ్యాంకు అధికారులు, ఐకేపీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

వాంకిడి(ఆసిఫాబాద్): జిల్లాలో నమోదయ్యే మలేరియా కేసులపై వైద్యసిబ్బందికి అప్రమత్తత అవసరమని, వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించి, వైద్యాధికారి ఉప్రె వినయ్‌ను అడిగి రోగుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యాధికారితోపాటు సిబ్బంది స్థానికంగా ఉంటూ సమయపాలన పాటించాలన్నారు. విషజ్వరాలు ప్రబలుతున్న గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని సూచించారు. మలేరియా నిర్ధారణ అయితే ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



ఎంపికైన విద్యార్థులతో డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకుల పాఠశాలలో బుధవారం జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాల్లో జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపిక చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసం కలిగిస్తాయన్నారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా ఈ పోటీల్లో మొత్తం 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో క్రీడా సమాఖ్య సాంబశివరావు, ప్రిన్సిపాల్ సురేశ్, డీఎస్‌వో మీనారెడ్డి, రిజనల్ స్పోర్ట్ అధికారి శంకర్, పీఈటీ, పీడీలు కృష్ణమూర్తి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన చదువే ఉద్యోగానికి పునాది

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత కోచింగ్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌రూరల్: క్రమశిక్షణతో కూడిన చదువే ఉద్యోగానికి పునాదిలాంటిదని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని టీచర్ ఉద్యోగాలు సాధించాలన్నారు. తల్లిదండ్రులతోపాటు నియోజకవర్గానికి పేరు తీసుకురావాలని సూచించారు. పట్టుదలతో శ్రమిస్తే సాధించలేనిది లేదని ఆయన పేర్కొన్నారు.

చెక్కులు పంపిణీ..

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పలువురు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందించారు. 133 మందికి రూ.1,33,15,428 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. పేదల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రాచకొండ గిరీశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ సక్రమంగా అమలు చేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్: రుణమాఫీ పథకం సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. హైదరాబాద్ నుంచి బుధవారం కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రుణమాఫీ, జీవో 58, 59, గృహలక్ష్మి, ఆసరా పింఛన్, నివాస స్థల పట్టాల పంపిణీ, గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం, తెలంగాణకు హరితహారం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకువచ్చిన రుణమాఫీ అర్హులందరికీ అందాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే మాట్లాడుతూ రూ.లక్ష రుణమాఫీ సంబంధించిన నిధులు బ్యాంకుల్లో జమ చేశామన్నారు. ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ కోసం జీవో 58, 59 అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే జిల్లాలో ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సంపద వనాల కింద మొక్కలు నాటడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఉద్యానవన, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ఆరుగురే మహిళా ఎమ్మెల్యేలు!

- ఉమ్మడి జిల్లా నుంచి చట్టసభల్లో 'ఆమె'కు దక్కిన అదృష్టం
- ఏడు అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానంలో నేటికీ రాని అవకాశం
- ప్రస్తుతం పదింటిలో ఒక్కరే శాసనసభ్యురాలిగా ప్రాతినిధ్యం
- 'మహిళా బిల్లు'తో భవిష్యత్‌లో మారనున్న రాజకీయం



పాటి సుభద్ర | పాల్వాయి రాజ్యలక్ష్మి | అమురాజుల శ్రీదేవి | సుమన్ రాథోడ్ | కోవ లక్ష్మి | రేఖానాయక్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచాలని 33శాతం సీట్లు రిజర్వు చేస్తూ కేంద్ర ప్రభుత్వం 128వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడంతో రాజకీయంగా మహిళా ప్రాతినిధ్యంపై చర్చ మొదలైంది. ఈ బిల్లు వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కాకున్నా.. 2029 ఎన్నికల వరకు అమలయ్యే అవకాశం ఉంది. ఈ చట్టం కార్యరూపం దాల్చితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది శాసనసభ స్థానాలు, రెండు లోకసభ స్థానాల్లో మహిళలకు రాజకీయంగా అవకాశాలు మెరుగుపడనున్నాయి. గత 70ఏళ్ల ఎన్నికల గణాంకాలు పరిశీలిస్తే.. ఉమ్మడి జిల్లాలోని పది స్థానాల్లో ఒక్కో స్థానం నుంచి 15మంది చొప్పున దాదాపు 150పైగా మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. కానీ వీరిలో ఆరుగురు మహిళలకు మాత్రమే చట్ట సభల్లోకి వెళ్లే అదృష్టం దక్కింది. పది స్థానాల్లో ఆసిఫాబాద్, సిర్పూర్, ఖానాపూర్ నియోజకవర్గాల నుంచే ఆరుగురు ఎమ్మెల్యేలుగా ఉండడం గమనార్హం. ఇక ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న పెద్దపల్లి, ఆదిలాబాద్ లోక్‌సభ స్థానాలకు 36మంది ఎంపీలుగా ఎన్నిక కాగా, ఇందులో పెద్దపల్లి నుంచి సుగుణకుమారి 1998లో 12వ లోక్‌సభకు ఒక్కసారి ఎన్నికయ్యారు.

ఆసిఫాబాద్ నుంచే ఆరంభం

ఉమ్మడి జిల్లా నుంచి తొలిసారిగా ఓ మహిళ ఎమ్మెల్యేగా ఎన్నికైంది ఆసిఫాబాద్ నుంచే. 1999లో ఉమ్మడి ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలో తాండూరు జెడ్పీటీసీగా ఉన్న భర్త, వెంకటకృష్ణయ్య ప్రోత్సాహంతో వైద్యురాలైన పాటి సుభద్ర తెలుగుదేశం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 2004లో అమురాజుల శ్రీదేవి టీడీపీ నుంచే గెలుపొందారు. టీఆర్ఎస్ నుంచి 2014లో కోవ లక్ష్మి ఎన్నికయ్యారు. ఈ ఒక్క స్థానం నుంచే ముగ్గురు మహిళలు శాసనసభ్యులుగా గెలిచారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత బెల్లంపల్లి ఏర్పడ్డాక, 2009లో ప్రజారాజ్యం నుంచి అమురాజుల శ్రీదేవి, 2014లో తెలుగుదేశం నంచి పాటి సుభద్ర పోటీ చేసి ఓడిపోయారు.

సిర్పూర్ నుంచి పాల్వాయి రాజ్యలక్ష్మి

1999 సెప్టెంబర్‌లో జరిగిన ఎన్నికలకు మూడు రోజుల ముందు నక్సలైట్ల చేతిలో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు ప్రాణాలు కోల్పోయారు. ఆ స్థానంలో ఆయన సతీమణి రాజ్యలక్ష్మికి టీడీపీ టికెట్ ఇచ్చింది. అలా అనూహ్యంగా ఆ స్థానం మహిళకు దక్కింది. 2004లో మళ్లీ పోటీ చేయగా రెండో స్థానంలో నిలిచారు.

ఖానాపూర్ నుంచి ఇద్దరు

2008లో తెలంగాణ ఉద్యమ సమయంలో వచ్చిన ఉప ఎన్నికల్లో టీడీపీ నుంచి సుమన్ రాథోడ్ గెలుపొందారు. ఆ తర్వాత 2009లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఆమె సామాజికవర్గంపై వివాదం రావడం, కోర్టు కేసులతో రాజకీయంగా ఇబ్బంది ఎదురైంది. ఈ మహిళ స్థానాన్ని మళ్లీ 2014, 2018లో రేఖానాయక్ భర్తీ చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా నుంచి ఏకైక మహిళా ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

సగం ఓట్లు వారివే.. అవకాశాలే తక్కువ

1952 నుంచి 2018మధ్య 15సార్లు ఒక్కో నియోజకవర్గం నుంచి 15మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. కొన్ని చోట్ల ఉప ఎన్నికలు కూడా వచ్చాయి. అయితే ఆసిఫాబాద్, ఖానాపూర్, సిర్పూర్ మినహా ఎక్కడా మహిళలకు అవకాశాలు రాలేదు. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నుంచి మహిళానాయకులు ఒక్కరు కూడా ఎన్నికై చట్టసభల్లో కాలు మోపలేదు. చివరగా 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్రాత్ సుజాత, ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కొన్ని చోట్ల స్వతంత్రంగా పోటీ చేస్తున్నప్పటికీ రాజకీయ పార్టీలు సైతం మిగతా చోట్ల టికెట్లు ఇచ్చి ప్రోత్సహించలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పురుషులతో సమానంగా మహిళలు జనాభా, ఓటర్లలో ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులుగా మాత్రం ఎన్నికయ్యే అవకాశం రాలేదు.

భవిష్యత్‌లో మార్పులు తప్పవు

మహిళా బిల్లుతో భవిష్యత్‌లో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో మార్పులు అనివార్యం కానున్నాయి. మహిళా కోటా అమలు చేస్తే ఇప్పుడున్న పది స్థానాల్లో కనీసం రెండు నుంచి మూడు స్థానాల వరకు మహిళలకే రిజర్వు కానున్నాయి. ఇందులో ఎస్సీ, ఎస్టీ స్థానాలు పోను, ఒక జనరల్ స్థానం ఉండనుంది. రొటేషన్ పద్ధతిలో ఉమ్మడి జిల్లా నుంచి ప్రతీ పదేళ్లకోసారి జరిగే డీ లిమిటేషన్ కమిటీ ప్రతిపాదనలతో మార్పులు చేర్పులు జరగనున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని మహిళా నాయకులకు అవకాశాలు మెరుగుపడనున్నాయి.

సమస్యల పరిష్కారానికి సమ్మె ఉధృతం చేస్తాం

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ముట్టడించిన అంగన్‌వాడీలు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయం వద్ద..

ఆసిఫాబాద్‌రూరల్: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట బుధవారం నిరసన తెలిపిన అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు పీఏకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం తాము సమ్మె చేస్తుంటే ప్రభుత్వం ఇతర శాఖల వారితో కేంద్రాలను తెరిపించడం సరికాదన్నారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరోజ, వనిత, అంజలి, వరలక్ష్మి, స్వప్న, లత, స్వాతి, రజిత, సంగీత, గీత, రమ్య తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు బుధవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లాలని విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, అంగన్‌వాడీ టీచర్ల వేతనాలు పెంచిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు.

క్లుప్తంగా

యువకుడి అనుమానాస్పద మృతి


రాకేశ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: పట్టణంలోని గర్మిళ్ల శివారులో రైలు కిందపడి ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఏసీసీ ప్రాంతానికి చెందిన సిద్దం శ్రీనివాస్–పద్మ దంపతుల కుమారుడు రాకేశ్ (19) ఈ నెల19న రాత్రి లక్నో ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు


పట్టుబడిన నిందితులు

బెల్లంపల్లి: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య తెలిపారు. మంగళవారం రాత్రి అశోక్ నగర్ మసీదు ఏరియాలో ఎస్సై ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన షేక్ ముజ్జు అలియాస్ సల్మాన్ , బాబుక్యాంపు బస్తీకి చెందిన చిలుముల సాగర్ పోలీసులను చూసి పారి పోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వారిని తనిఖీ చేయగా 95 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. మహారాష్ట్ర నుంచి తక్కువ ధరకు గంజాయి తీసుకువచ్చి బెల్లంపల్లి లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వివాహిత బలవన్మరణం


రవళి(ఫైల్)

నస్పూర్: ఉరేసుకుని వివాహిత బలవన్మరణం చెందిన సంఘటన సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం జన్నారంకు చెందిన కుదురుపాక అంజన్న కుమార్తె రవళి (26)కి సీసీసీ నస్పూర్ సంఘం మల్లయ్యపల్లెకు చెందిన సింగరేణి ఉద్యోగి కళ్యాణం రవితో వివాహమైంది. దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. సీసీసీ కార్నర్ వద్ద జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్నారు. కొంత కాలంగా రవళి అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు తండ్రి అంజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'బాసర ట్రిపుల్‌ఐటీలో సీట్ల భర్తీపై అనుమానాలు'

పాతమంచిర్యాల: బాసర ట్రిపుల్ ఐటీలో ఆర్మీ ఉద్యోగుల పిల్లలు, ఎన్‌సీసీ, దివ్యాంగులకు సంబంధించిన సీట్ల భర్తీపై పలు అనుమానాలు ఉన్నాయని తెలంగాణ విద్యార్థి జనసమితి రాష్ట్ర కార్యదర్శి బచ్చలి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక కేటగిరీ కింద 96 సీట్లను పూర్తిస్థాయిలో భర్తీ చేయక పోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. గతేడాది దివ్యాంగుల కోటాలో 35 నుంచి 40 సీట్లు భర్తీ చేసిన అధికారులు ఈ ఏడాది 14 సీట్లు భర్తీ చేసినట్లు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పెట్టారని, అందులో ఎంతమంది అడ్మిషన్లు పొందారో స్పష్టం చేయలేదన్నారు. ఆర్మీ క్రీడాకారుల కోటాలో భర్తీ చేయాల్సిన సీట్లకు రెండు మూడు సార్లు లిస్టులు పెట్టి భర్తీ చేసిన అధికారులు దివ్యాంగులకు చెందిన సీట్లకు ఒక్కసారి లిస్టు ప్రదర్శించి చేతులు దులుపుకోవడం మోసం చేయడమేనన్నారు.

'సెల్ఫీ విత్ గణేశ్'కు స్పందన

మంచిర్యాలఅర్బన్/ఆసిఫాబాద్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ ఏడాది గణపతి మట్టి విగ్రహాలపై 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'సెల్ఫీ విత్ గణేశ్'కు అనూహ్య స్పందన లభించింది. వినాయక చవితి పురస్కరించుకుని పలువురు తమ ఇళ్లలో విభిన్న ఆకృతుల్లో ఉన్న మట్టి గణపతుల ప్రతిమలను ఏర్పాటు చేసుకుని భగవంతునిపై భక్తి, పర్యావరణ పరిరక్షణపై అంకితభావం చాటుకున్నారు. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి వచ్చిన వాటిలో కొన్ని..


నల్ల కార్తీక్, ఆదిత్య ఎంక్లేవ్, మంచిర్యాల


అనిరుధ్, దండేపల్లి


బి.లక్ష్మి, రాజీవ్‌నగర్, మంచిర్యాల


మల్రాజ్ శ్రీధర్‌రావు, హైటెక్‌సిటీ, మంచిర్యాల


ఎన్.సాయిప్రియ, సప్తగిరి కాలనీ, మంచిర్యాల


గుండేటి యోగేశ్వర్, జన్మభూమినగర్, మంచిర్యాల


పున్నం, మంచిర్యాల


గుండా శ్రీనివాస్, ఆర్బీరోడ్, మంచిర్యాల


అంకం నరేశ్, రాంనగర్, మంచిర్యాల


రమాదేవి, బెల్లంపల్లి


సంఘ సేవకి గణేశ్ మండలి, ఆసిఫాబాద్


రాంప్రకాశ్, హైటెక్‌సిటీ, మంచిర్యాల


బి.కుమారస్వామి, హమాలీవాడ, మంచిర్యాల


తోట లక్ష్మణ్, గౌతమినగర్, మంచిర్యాల


కొమురంభీమ్ చౌక్, ఆసిఫాబాద్


సాయినివాడ, ఆసిఫాబాద్


బాపూనగర్, ఆసిఫాబాద్


శివకేశవ మందిర్, ఆసిఫాబాద్

'కీలక విభాగాల్లో కాంట్రాక్ట్ విధానం సరికాదు'

రామకృష్ణాపూర్(చెన్నూర్): సింగరేణి సంస్థకు చెందిన అకౌంట్స్, మార్కెటింగ్, పర్చేజ్ వంటి విభాగాల్లో హైస్కిల్డ్ పనికోసం కాంట్రాక్ట్ విధానంలో ఉద్యోగులను నియమించేందుకు సర్క్యులర్ జారీచేయడాన్ని వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మందమర్రి ఏరియాలోని ఆర్కే ఓసీలో బుధవారం ఆందోళన చేపట్టారు. యూనియన్ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ మాట్లాడుతూ కీలక విభాగాల్లో హైస్కిల్డ్ పనులు చేసేందుకు సింగరేణిలో అనేకమంది ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని, వారిని కాదని కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించడం సరికాదన్నారు. కంపెనీని ప్రైవేటీకరించే చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి కార్యదర్శి ఆంజనేయులు, ఇప్పకాయల లింగయ్య, సంపత్‌కుమార్, హరిరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

మంచిర్యాలఅర్బన్: రాష్ట్రస్థాయి ఖేల్ ఇండియా ఉమెన్ లీగ్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌కు మిమ్స్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 14న లక్సెట్టిపేట క్రీడామైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఉమెన్ అథ్లెటిక్స్ పోటీల్లో కళాశాలకు చెందిన విద్యార్థులు షార్ట్‌పుట్‌లో మనిప్రియ, నేహరాజుభార్, 200 మీటర్ల పరుగుపందెంలో శ్రీనిధి ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థినులు పాల్గొంటారని కరస్పాండెంట్ శ్రీనివాస్ రాజు తెలిపారు.


అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాస్‌రాజు

సదరు విద్యార్థినులను బుధవారం కళాశాల డైరెక్టర్లు ఉపేందర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ శైలజ అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు కానిస్టేబుల్ ఎంపిక


కానిస్టేబుల్‌కు పూలమొక్క అందిస్తున్న ఎస్పీ

ఆసిఫాబాద్‌రూరల్: జాతీయ స్థాయి పిస్టోల్(షూటింగ్) పోటీలకు ఎంపికైన మహిళా కానిస్టేబుల్ స్రవంతిని బుధవారం ఎస్పీ సురేష్ కుమార్ తన కార్యాలయంలో పూలమొక్క అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కౌటాల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న స్రవంతి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షనీయమన్నారు. జిల్లాలోని మహిళా కానిస్టేబుళ్లకు ఆమె ఆదర్శప్రాయమన్నారు. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన పిస్టోల్ పోటీల్లో సౌత్‌జోన్‌లో 25 మీటర్ల విభాగంలో నాలుగోస్థానంలో నిలిచిందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

వేమనపల్లి: నీల్వాయి జెడ్పీఎస్ఎస్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు, కోటపల్లి మోడల్‌స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల మంచిర్యాల జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లక్సెట్టిపేట క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీల్లో జడగల్ల అంజలి హైజంప్, ఎండి హర్షిన్‌బాను 100 మీటర్ల పరుగు పందెం, కృష్ణవేణి 400 మీటర్ల పరుగుపందెం, భీమరాజుల బతుకక్క 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబర్చారు. ఈ నెల 21న హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగనున్న పోటీల్లో పాల్గొననున్నారు.

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

శ్రీరాంపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, నాయకులు మహేందర్, సర్వజన, కళ, స్వరూప, లక్ష్మి పాల్గొన్నారు.

నేడు కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం తెలిపారు. బుధవారం ఆయన కృష్ణా కాలనీలో కాంట్రాక్ట్ కార్మికులను కలిసి ధర్నాలో పాల్గొనాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు చాలీచాలని వేతనాలు వస్తున్నాయన్నారు. కంపెనీ సాధించిన లాభాల నుంచి కాంట్రాక్ట్ కార్మికులకు వాటా ఇవ్వాలని, కోలిండియాలో అమలవుతున్న హైపర్ కమిటీ వేతనాలను సింగరేణిలో అమలు చేయాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో కొత్తగా ఉద్యోగాల్లో చేరిన యువ కార్మికులు క్రమశిక్షణతో పని చేయాలని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి సూచించారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం 41 మందికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించాలన్నారు. కష్టపడి పనిచేసి సంస్థ ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారికి సన్మానం..

జైపూర్ ఎస్టీపీపీలో డీజీఎం పర్సనల్‌గా విధులు నిర్వర్తించిన కే.నారాయణ రావు కార్పొరేట్ కార్యాలయంకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా జీఎం సంజీవరెడ్డి శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు.


నియామకపత్రం అందజేస్తున్న జీఎం

ఈసీజీ పరికరం ప్రారంభం ..

శ్రీరాంపూర్‌లోని ఆర్కే 8 డిస్పెన్సరీలో రూ.3 లక్షలు వెచ్చించి నూతనంగా ఏర్పాటు చేసిన రెండు అల్ట్రా మోడల్ లేటెస్ట్ ఈసీజీ పరికరాలను ఏరియా జీఎం సంజీవరెడ్డి బుధవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డెప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, వైద్యులు వేద వ్యాస్, మురళీధర్, లోకనాథ్‌రెడ్డి స్వప్న పాల్గొన్నారు.

'అధికారుల వైఖరి సరికాదు'

శ్రీరాంపూర్: తమకంటే కార్మికుల వేతనాలు అధికంగా పెరిగాయని అధికారులు కోర్టుకు వెళ్లడం సరికాదని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జే.శంకర్‌రావు అన్నారు. బుధవారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 11వ వేతన ఒప్పందంలో అధికారుల వేతనాల కంటే కార్మికుల వేతనాలు అధికంగా పెరిగాయన్నారు. పెరుగుదల డీపీఈ గైడ్‌లైన్స్‌కు విరుద్ధమని అధికారుల సంఘం నాయకులు కోర్టుకు వెళ్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారులు వారి వేతనాలు కోసం కొట్లాడాలికానీ కార్మికుల వేతనాలు పెరిగాయని కోర్టుకు పోవడం సరికాదన్నారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు భీంరావు, కలవేని శ్యాం, గరిగే స్వామి, డివిజన్ నాయకులు సమ్మె రాజయ్య, శీలం చిన్నయ్య, పిట్ సెక్రెటరీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శంకర్‌రావు

నల్లబ్యాడ్జీలు ధరించి క్లర్కుల నిరసన

శ్రీరాంపూర్: సింగరేణిలో క్లర్కులను కూడా కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవడాన్ని నిరసిస్తూ సింగరేణి కాలరీస్ క్లరికల్ అసోసియేషన్ (సిక్కా) ఆధ్వర్యంలో బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి క్లర్కులు నిరసన తెలిపారు. అనంతరం జీఎం సంజీవరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిక్కా ఏరియా ఉపాధ్యక్షుడు కన్నం సాంబయ్య మాట్లాడుతూ హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో పర్మినెంట్ వారు పనిచేసే స్థానంలో కాంట్రాక్ట్ వారిని పెట్టుకోవడం అన్యాయమన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రీజియన్ ఉపాధ్యక్షుడు ముస్కె సమ్మయ్య, ఏరియా సెక్రెటరీ కె.శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సుద్దాల శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.


జీఎంకు వినతిపత్రం ఇస్తున్న క్లర్కులు

ఒప్పందాలు అమలు చేయాలి

శ్రీరాంపూర్: కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లపై ఇది వరకు జరిగిన ఒప్పందాలు అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్ అలీ డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గతేడాది సెప్టెంబర్ 9 నుండి 26 వరకు జరిగిన సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయడం లేదన్నారు కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని, సీఎంపీఎఫ్ చీటీలు అందించాలని, ఈ నెల 21న సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆ యూనియన్ రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, డివిజన్ అధ్యక్షుడు డీ.రవీందర్ నాయకులు వీరేశం, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు షోకాజ్ నోటీస్

బెల్లంపల్లిరూరల్: మండలంలోని చంద్రవెల్లి గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు 2014–15 ఆర్థిక సంవత్సరంలో బీఆర్‌జీఎఫ్ (బ్యాక్‌వర్డ్ రీజియన్స్ గ్రాంట్ ఫండ్) నుంచి రూ.4.80 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా మాజీ సర్పంచ్ కొమ్మెర వీణ నిధులను దుర్వినియోగం చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు గజెల్లి రాజ్‌కుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో స్పందించిన కలెక్టర్ మాజీ సర్పంచ్ వీణకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు.

'బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'



మాట్లాడుతున్న శ్రీనివాస్

నస్పూర్: బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర వ.ర్కింగ్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో మంచిర్యాల నియోజకవర్గ బీసీ జాగృతి ఉపాధ్యక్షుడు కలవల సుధాకర్, కార్యదర్శి ప్రకాశ్, సదానందం, నాయకులు తిప్పని భీమన్న, పెద్దపల్లి సూరయ్య పాల్గొన్నారు.

కులంపేరుతో దూషించిన వ్యక్తికి జరిమానా

మంచిర్యాలక్రైం: కోర్టు హాలులో జడ్జి ముందే ఫిర్యాదుదారుడిని కులంపేరుతో దూషించి దాడికి పాల్పడిన వ్యక్తికి రూ.3 వేల జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టు అదనపు న్యాయమూర్తి, జిల్లా సెషన్స్ జడ్జి డాక్టర్ పీ.శివరాంప్రసాద్ బుధవారం తీర్పునిచ్చినట్లు స్థానిక సీఐ రాజు తెలిపారు. ఓ ప్రైవేటు కేసు విచారణ నిమిత్తం 2017 సెప్టెంబర్14న కోర్టుకు హాజరైన స్థానిక గౌతమినగర్‌కు చెందిన బిల్లా మల్లయ్య ఫిర్యాదు దారుడైన అజ్మీర రాజేశ్ నాయక్‌ను కులంపేరుతో దూషించి దాడికి పాల్పడ్డాడు. అప్పటి ఏసీపీలు చెన్నయ్య, ఎండీ. గౌస్‌బాబా, ఎస్సై ఆకుల అశోక్ విచారణ చేపటి మల్లయ్యపై కేసు నమోదు చేసి ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం పీపీ కిరణ్‌కుమార్ రెడ్డి, లైసన్ ఆఫీసర్ సయ్యద్ తాజొద్దీన్ 9మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువుకావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చినట్లు తెలిపారు.